క్లుప్తంగా

ప్రధాన రహదారిపై పశువుల సంచారం



లయన్స్ కమ్యూనిటీ హాల్ మార్గంలో సంచరిస్తున్న పశువులు

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలోని ప్రధాన రహదారులపై పశువుల సంచారం ఎక్కువ కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో వాహనాల మీదకు వచ్చేస్తుండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా కోట జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్‌కు వెళ్లే మార్గంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పశువుల సంచారం ఎక్కువగా ఉందని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న త్రినాథ్, తదితరులు

పూసపాటిరేగ: పట్టణంలోని రాజావీధిలో పలువురు పేదలకు హార్ట్ సంస్థ చైర్మన్ ఎ. త్రినాథ్ సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఊహ, అల్లాడ రాము, ఎస్‌వీ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో పరిసరాల పరిశుభ్రత



మిల్లు పరిసరాల్లో శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నెల్లిమర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నగర పంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల జూట్‌మిల్లు ప్రాంతంలో సోమవారం 'మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ సెహర్' కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ బాలాజీ ప్రసాద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు మిల్లు పరిసరాలను శుభ్రం చేశారు. పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం చూపండి

బొండపల్లి: స్పందనలో వచ్చిన ప్రతీ సమస్యను పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.వేదవతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. నిర్దేశిత సమయంలోగా ఫిర్యాదులపై విచారణ చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మెరకముడిదాం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని తెలిపారు. మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు గజపతినగరం టౌన్‌లో, అలాగే జిన్నాం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సెకండ్ సర్క్యూట్ ఎల్‌సీ ఏర్పాటు చేస్తున్నందున మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు వెల్లడించారు.

సచివాలయ ఉద్యోగులతో సమీక్ష

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎంపీడీఓ బీఎన్ఎస్‌కే పట్నాయక్, పంచాయతీరాజ్ ఏఈ ఆలీ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ప్రయారిటీ వర్కులు, నాన్ ప్రయారిటీ వర్కులు, జగనన్నకు చెబుదాం, ఫ్యామిలీ డాక్టర్ సేవలు తదితర అంశాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వలంటీర్లు నిస్వార్థ సేవకులు

● ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



పూసపాటిరేగ: కొప్పెర్లలో సన్మానం అందుకున్న వలంటీర్లతో అధికారులు, ప్రజాప్రతినిధులు

విజయనగరం రూరల్: ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్న నిస్వార్థ సేవకులు గ్రామ వలంటీర్లని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జొన్నవలసలో రాకోడు, జొన్నవలస గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లను ఎంపీపీ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ, మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి జగనన్న గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారని చెప్పారు. నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, జొన్నవలస, రాకోడు గ్రామ సర్పంచ్‌లు రమాదేవి, పి.వెంకటరమణ, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శులు అప్పలనాయుడు, భాగ్యరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లదే కీలకపాత్ర

పూసపాటిరేగ: ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లదే కీలకపాత్ర అని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని కొప్పెర్ల, వెల్దూరు, తిప్పలవలస గ్రామాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పలువురు వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలలో వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. తక్కువ జీతాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీడీఓ జి. రామారావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, పైడి రవి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

సేవలు ప్రశంసనీయం

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ నిష్పక్షపాతంగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు అన్నారు. మండలంలోని అలుగోలు గ్రామ సచివాలయంలో వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు చేరవేయడంలో వలంటీర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖున పొద్దు పొడవక ముందే లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాన్ని నెరవేరుస్తున్నారని కొనియాడారు. అనంతరం సేవారత్న పురస్కారగ్రహీత అలుగోలు మహేష్‌కు రూ.20 వేల నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారమ్మ, కార్యదర్శి రాంజీరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: మహేష్‌ను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ వైకుంఠం నాయుడు, తదితరులు

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, తదితరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రశాంతంగా జరిగింది. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని ప్రవేశపెట్టిన పలు తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సరోజిని మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం, బీపీఎస్, ప్లాన్–నాన్‌ప్లాన్, ఎస్‌సీఎస్‌పీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఇటీవల టెండర్లు పిలిచినట్లు తెలిపారు. వివిధ వార్డుల్లో చేపట్టదలచిన 17 సీసీ రోడ్లు, కాలువ నిర్మాణ పనులకు వర్క్ ఆర్డర్లు మంజూరు చేయడానికి ఈ సందర్భంగా సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే రూ. 4 లక్షలతో వీధి లైట్లు, ఇతర విద్యుత్ మెటీరియల్ కొనుగోలు చేయడానికి వేసిన టెండర్‌ను కూడా సభ్యులు ఆమోదించారు. కౌన్సిల్ సమావేశానికి ప్రత్యేకించి హాల్ లేనందున చైర్‌పర్సన్‌కు కేటాయించిన హాల్‌లోనే ప్రస్తుతం సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ హాల్‌లో ఏర్పాటు చేసేందుకు ఒక ఏసీ, రెండు వాల్ మౌంటెడ్ ఫ్యాన్లు కొనుగోలుకు సభ్యులు ఆమోదం తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాకు, వీధిలైట్ల నిర్వహణకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు సమావేశంలో కోరారు. కమిషనర్ పి.బాలాజీప్రసాద్, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యుడు చిక్కాల సాంబశివరావు, మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రాణం కాపాడడమే లక్ష్యంగా సేవలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఓజేడీ ట్రైనర్ శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: రోగి ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా సేవలు అందించాలని ఓజేడీ (ఆన్ జాబ్ ట్రైనింగ్) ట్రైనర్ ఆలుబిల్లి శ్రీనివాస్ సూచించారు. విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి ప్రాంతాలకు చెందిన ఈఎంటీలకు చిన్నపిల్లలకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫోన్ వచ్చిన క్షణాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని అవసరమైన చికిత్స అందించాలన్నారు. 108 అంబులెన్స్‌ల పట్ల ప్రజలకు మంచి విశ్వాసం ఉందని, ఆ నమ్మకాన్ని నెలబెట్టుకోవాలని సూచించారు. అనంతరం వాహనంలో ఉండే మందుల ఉపయోగాలు, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయిషణ్ముఖ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అప్పగింత



బాధితురాలికి కుట్టుమిషన్ అప్పగిస్తున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల: ఆటోలో మరిచిపోయిన కుట్టుమిషన్‌ను సంబంధిత మహిళకు నెల్లిమర్ల పోలీసులు అప్పగించిన సంఘటన సోమవారం జరిగింది. గుర్ల మండలం దమరసింగి గ్రామానికి చెందిన రెడ్డి రేవతి విజయనగరంలో కుట్టుమిషన్ కొనుగోలు చేసి, ఆటోలో తన స్వగ్రామానికి బయలుదేరింది. అదే ఆటోలో కుట్టుమిషన్‌ను మరిచిపోయి, వేరే పనిమీద నెల్లిమర్లలో దిగిపోయింది. ఎంత వెతికినా దొరక్కపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై పి. నారాయణరావు తన సిబ్బందితో ఆటోను వెతికి కుట్టుమిషన్‌ను బాధితురాలికి అప్పగించారు.

వేసవి శిక్షణ తరగతులకు స్పందన



కథల పుస్తకాలు చదుతున్న విద్యార్థులు

డెంకాడ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. శిక్షణ తరగతులకు డెంకాడ, గుణుపూరు గ్రామాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరౌతున్నారు. వీరికి వివిధ రకాల కథల పుస్తకాలతో పాటు సమాచారం, విజ్ఞానం అందించే పుస్తకాలను అందుబాటులో ఉంచారు. లైబ్రేరియన్ మహేష్ విద్యార్థులకు అన్ని రకాలుగా సహకరిస్తున్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

శృంగవరపుకోట: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాల సాగుపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతం అవుతుందని, ఫలితంగా ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు.

సకాలంలో రైతులకు వరి విత్తనాలు

● ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వరి విత్తనాలు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు వ్యవసాయాధికారులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల వారీగా అందిస్తున్న సేవలు, వాటి వివరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాలపై ఎంపీపీ, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అధికారులతో మాట్లాడారు. అనంతరం మండల వ్యవసాయశాఖాధికారి పి.నిర్మల మాట్లాడుతూ, రానున్న ఖరీఫ్‌లో వరి విత్తనాలు సకాలంలో అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మండల విద్యాశాఖాధికారి అంబళ్ల కృష్ణారావు, 'నాడు – నేడు' ఏఈ రాజు మాట్లాడుతూ, మండలంలో ఇప్పటికే రెండు విడతల్లో పాఠశాలలను అభివృద్ధి చేశామని, రెండో విడత పనులను రానున్న విద్యా సంవత్సరంలోపు పూర్తిచేసే విధంగా చర్య లు తీసుకుంటున్నట్లు చెప్పారు. మూడో విడతలో మరో 20 పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే నెలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, తదితర వస్తువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. హౌసింగ్ డీఈ మురళి మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపో తే వాటిని రద్దు చేసి వేరే వారికి కేటాయస్తామన్నా రు. సమావేశంలో వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాకుల అనిత, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, పలువు రు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఫ్యాషన్ టెక్నాలజీలో రాణించాలి



కుట్టుమిషన్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక

గజపతినగరం: ప్రస్తుతం ఫ్యాషన్ టెక్నాలజీకి మంచి డిమాండ్ ఉందని, మహిళలు ప్రభుత్వం అందించే టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఫ్యాషన్‌రంగంలో రాణించాలని జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో కుట్టుశిక్షణ తీసుకున్న నలుగురు మహిళలు మెంటాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన టైలరింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పొందడమే కాకుండా, మరో పది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న మామిడి సంధ్య, గాయిత్రి, మాలతి, గౌరిలను జెడ్పీటీసీ, ఎంపీపీ అభినందించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, స్థానిక నాయకులు బెల్లాన త్రినాథరావు, గిడిజాల కామునాయుడు, వెలుగు ఏపీఎం యు.జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను శ్మశానవాటికతో పోల్చడం సరికాదు

- తక్షణమే చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు



మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన ర్యాలీ

వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు శ్మశానవాటికతో పోల్చటం సరికాదని, ఆ మాటలను వెనక్కితీసుకుని పేదలకు క్షమాపణలు చెప్పాలని డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు డిమాండ్ చేశారు. ఎస్.కోటలో సభలో పాల్గొన్న ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రభుత్వంపై, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చినరామునాయుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉండగా పేదలకు ఒక సెంటు భూమి కూడా ఇవ్వలేదని, కానీ నేడు జగనన్న ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే వాటిని శ్మశానవాటికలు, సమాధులు అంటూ మాట్లాడటం సరికాదన్నారు. జడ్పీటీసీ ఎస్.అప్పారావు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తప్పుడు మాటలు మాట్లాడితే ప్రజలు సహించరని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరీ, నెడ్‌క్యాప్ డైరెక్టరు సీహెచ్ పద్మావతి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, మండల వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జి మెరపల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తినాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని వ్యతిరేకిస్తే.. ప్రజా వ్యతిరేకత తప్పదు



మూడురోడ్లు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అరకు–విశాఖ రోడ్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ

కొత్తవలస: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 18న ఎస్.కోటలో నిర్వహించిన సభలో ఎస్సీ, ఎస్టీ, పేద, బడుగు బలహీన వర్గాలను ఉద్దేశించి మాట్లాడిన తీరును రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కొత్తవలస మూడురోడ్ల జంక్షన్‌లో సోమవారం భారీ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పేదల సంక్షేమాన్ని వ్యతిరేకిస్తే.. ప్రజా వ్యతిరేకత తప్పదంటూ నినాదాలు చేశారు. జగనన్న సంక్షేమానికి జగమంతా జేజేలు పలుకుతుంటే చంద్రబాబు తట్టుకోలేక ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని, పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను శ్మశానాలు అంటూ తప్పుడు కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. పేదల సంక్షేమాన్ని అడ్డుకుంటున్న టీడీపీ రానున్న ఎన్నికల్లో పుట్టగతులు లేకుండా పోతుందని ధ్వజమెత్తారు. అంతకుముందు చంద్రబాబు దిష్టిబొమ్మను మూడు రోడ్లు జంక్షన్‌లో ఊరేగిస్తూ బాబు వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. కాగా దిష్టిబొమ్మను దహనం చేసే సమయంలో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎం.రామస్వామి, పార్టీ నాయకులు మేలాస్త్రీ అప్పారావు, గొరపల్లి రవికుమార్, బొంతల వెంకటరావు, పలు గ్రామాలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.


గడపగడపకూ సంక్షేమ పథకాలు




సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గడపగడపకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మేజర్ పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి ఎంపీ గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి నాలుగేళ్లుగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి కూడా ఎవరికైనా పథకాలు రాకపోతే తక్షణమే సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సిఫార్సులకు, అవినీతికి తావులేకుండా..పేదలందరికీ సంక్షేమ పథకాలను ప్రతీ నెలా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కొసిరెడ్డి రమణ, డీజే, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు ఎంపిక



మునకాల ఉమ



దాసరి షణ్ముఖరావు



ఆర్.జ్యోత్స్న

గుర్ల: జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలకు గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మునకా ల ఉమ, దాసరి షణ్ముఖరావు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిక్కి రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ ఇద్దరు విద్యార్థులను ఈనెల 25న చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించను న్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మునకా లు ఉమ 959, దాసరి షణ్ముఖరావు 754 మార్కులు సాధించి కాలేజీలో టాపర్‌లుగా నిలిచారన్నారు.

గంట్యాడ: 'జగనన్న ఆణిముత్యాలు' పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న నగదు ప్రోత్సాహకానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అరిపాక జ్యోత్స్న ఎంపికైంది. జ్యోత్స్న హెచ్ఈసీ గ్రూపులో వెయ్యికి 908 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో టాపర్‌గా నిల వడంతో ఆమెకు ఈ అవార్డు వరించిందని ప్రిన్సిపాల్ ఎల్.వి.ఎస్.జగన్నాథరావు తెలిపారు. ఈ నెల 25న నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు



కబడ్డీ పోటీల్లో రాణించిన విద్యార్థినులతో జిల్లా సమన్వయాధికారి చంద్రావతి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు

వేపాడ: విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ జట్టులో వేపాడ, చీపురుపల్లి, నెల్లిమర్లకు చెందిన గురుకుల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచారు. క్రీడాకారులను గురుకులాల జిల్లా సమన్వయాధికారి చంద్రావతి అభినందించారు.